ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

19 వ శతాబ్దం తెలుగు పత్రికలు

డా. కె. లావణ్య

తెలుగు అధ్యాపకురాలు, MJPTBCWRDC,వర్ధల్

Article Received: 10/09/2026

Article Accepted: 15/11/2026

Published Online: 19/11/2026

DOI:10.53414/Sahithyatharangini.2026.3.4.119

సారాంశం

ఈ వ్యాసం 19వ శతాబ్దంలో తెలుగు భాషలో వెలువడిన వివిధ పత్రికల ఆవిర్భావం, వికాసం, వాటి సాహిత్య, సామాజిక సేవలను ప్రధానంగా పరిశీలిస్తుంది.తెలుగు పత్రికలు ప్రజలకు సమాచారాన్ని అందించడమే కాకుండా, హిత్యాభివృద్ధికి కీలకమైన వేదికలుగా నిలిచాయి.ముఖ్యంగా ముద్రణా యంత్రాల అభివృద్ధి, క్రైస్తవ మిషనరీల కృషి, సాంఘిక సంస్కరణోద్యమాలు పత్రికల ఆవిర్భావానికి దోహదపడ్డాయి.ఈ కాలంలో వెలువడిన దిన, వార, పక్ష, మాస పత్రికల స్వరూపాలను, వాటి ప్రత్యేకతలను ఈ వ్యాసం వివరిస్తుంది.సారస్వత, సాంఘిక, రాజకీయ, వైజ్ఞానిక, నైతిక, మత, పారిశ్రామిక, విద్యా, న్యాయ, వేదాంత, హాస్య, మహిళా పత్రికల సేవలను విశ్లేషిస్తుంది.సుజనరంజని, వివేకవర్ధని, ఆంధ్రప్రకాశిక, అముద్రిత గ్రంథ చింతామణి వంటి పత్రికల ప్రాధాన్యాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తుంది.ఈ పత్రికలు తెలుగు భాషా వికాసానికి, సాహిత్య ప్రక్రియల అభివృద్ధికి, గ్రంథ విమర్శకు విశేషంగా లోడ్పడ్డాయి. అంతేకాకుండా నవల, కథ, కవిత్వం, నాటకం వంటి సాహిత్య ప్రక్రియలకు గుర్తింపు కల్పించడంలో కీలక పాత్ర పోషించాయి.స్త్రీ విద్య, సామాజిక సంస్కరణలు, వైజ్ఞానిక దృక్పథం, రాజకీయ చైతన్యం వంటి అంశాల వ్యాప్తికి కూడా పత్రికలు వేదికలుగా నిలిచాయి.ఈ విధంగా 19వ శతాబ్దపు తెలుగు పత్రికలు ఆధునిక తెలుగు జర్నలిజానికి, సాహిత్య చరిత్రకు పునాదులు వేసిన విశిష్ట ప్రచురణా మాధ్యమాలుగా నిలిచాయని ఈ వ్యాసం తెలియజేస్తుంది.

కీలక పదాలు:తెలుగు పత్రికలు,పత్రికా చరిత్ర,తెలుగు సాహిత్య వికాసం,సామాజిక సంస్కరణలు,19వ శతాబ్దం

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

సమాజంలో జరుగుతున్న సంఘటనలను, విశేషాలను, సమాచారాన్ని ప్రజలకు చేరవేసే **ప్రసార సాధనాలను పత్రికలు** అంటారు. ఇవే కాకుండా సాహిత్యాన్ని ప్రచారంచేయడానికి, వివిధ సాహితీ ప్రక్రియల ఆవిర్భావానికి పత్రికలు విస్తృతంగా కృషి చేశాయి. సాహిత్య వ్యాప్తితో పాటు అనేక మంది కవులను వెలుగులోకి తెచ్చాయి. దాంతో పాటు తెలుగు సాహిత్య అభివృద్ధి, సాహిత్య చరిత్రకు ఉపకరించే అనేక ఉపయోగాలు పత్రికల ద్వారా జరిగాయి. పత్రికల ద్వారానే నవల, కథ, కథానిక, కవిత్వం వంటి సాహిత్య ప్రక్రియలకు ప్రథమంగా గుర్తింపు లభించింది పత్రికల ద్వారానే అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

భారత దేశంలో క్రైస్తవ మతవ్యాప్తికోసం ప్రారంభమైన పత్రికలు, తరువాతికాలంలో రాజకీయ, వైజ్ఞానిక, విద్య, శాస్త్ర, సినిమా, వేదాంతం, హాస్యం, సాహిత్యం మొదలైన అంశాలకు ప్రాధాన్యమిస్తూ వెలువడ్డాయి. ఇందులో సాహిత్యానికి మాత్రమే ప్రాధాన్యమిస్తూ వెలువడిన సాహిత్యపత్రికలే కాకుండా, వార్తా, రాజకీయ, సాంఘిక, విజ్ఞాన, మత పత్రికలుగా వెలువడిన ఇతర పత్రికలు కూడా సాహిత్యాన్ని ప్రచురించి, తెలుగు సాహిత్యానికి తమవంతు సేవను అందించాయి, అందిస్తున్నాయి. పత్రికలు ప్రారంభమైనప్పటినుంచి ఇప్పటివరకు వివిధ రకాలుగా పత్రికలు వెలువడుతున్నాయి.

చాలా వరకు పత్రికలు మాస/వారపత్రికలుగా ప్రారంభమై, పాఠకుల సంఖ్య పెరిగే కొద్దీ దినపత్రికలుగా రూపాంతరం చెందాయి. 19వ శతాబ్దపు ద్వితీయార్ధంలో రాజమండ్రి, మచిలీపట్నం, బళ్ళారి, మద్రాసు నగరాలలో ప్రింటింగ్ ప్రెస్‌లు పెరగడంతో ప్రచురణ సులభతరమైంది. వార్తల కంటే కూడా సామాజిక సంస్కరణలు, భాషా చర్చలు, నాటక విమర్శలు మరియు మత సిద్ధాంత ఖండనలకు ఈ పత్రికలు వేదికగా నిలిచాయి.

ఈ వ్యాసంలో ప్రధానంగా 19 వ శతాబ్దంలో వెలువడిన పత్రికలను పరిచయం చేస్తున్నాను. ఆ కాలంలో ఏఏ రకాలైన పత్రికలు వెలువడ్డాయి. వాటిలోని రకాలను, ప్రత్యేక అంశాలను పరిచయం చేయడం ఈ వ్యాసం ఉద్దేశ్యం. 19వ శతాబ్దంలో విస్తరించిన ఈ పత్రికా పునాదుల ఆధారంగానే, 20వ శతాబ్దం ప్రారంభంలో (కృష్ణా పత్రిక, ఆంధ్రపత్రిక వంటి) పూర్తిస్థాయి దినపత్రికల యుగం ప్రారంభమైంది అని చెప్పవచ్చు. ప్రధానంగా ఈ 19 వ శతాబ్దంలో వెలువడిన పత్రికలను నాలుగు రకాలుగా వర్గీకరించుకోవచ్చు. అవి **1. దినపత్రికలు 2. వారపత్రికలు3. పక్ష పత్రికలు 4. మాస పత్రికలు.**

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

1. దిన పత్రికలు

రోజువారీ వెలువడే పత్రికలను దిన పత్రికలు అని అంటారు. ఈ శతాబ్దంలో ఎలాంటి దినపత్రికలు వెలువడలేదు. ఈ కాలంలో మాస పత్రికలు, పక్ష పత్రికలు, వార పత్రికలు మాత్రమే వెలువడ్డాయి.

2. వార పత్రికలు

వారానికి ఒకసారి వెలువడే పత్రికలను "వార పత్రికలు"అంటారు. ఇందులో సారస్వత పత్రికలు, సాంఘిక, రాజకీయ, నైతిక, వైజ్ఞానిక, మత, పారిశ్రామిక వార పత్రికలు ఉన్నాయి.

2.1 సారస్వత వార పత్రిక

బి.సి.వి. శ్రీనివాసాచార్యులు 1895లో *సూర్యాలోకము* అనే సారస్వత పత్రికను మద్రాసునుంచి వెలువరించారు. వీరేశలింగం పంతులు శాకుంతలాంధ్రీకరణపై చేసిన గ్రంథసమీక్ష ఈ పత్రికలోనే ప్రచురించారు. వెంకటసుబ్బయ్యర్ ముద్రించిన ధూర్జటికవి *శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము*పై విమర్శ ఈ పత్రికలోనే ప్రకటించబడింది.

2.2 సాంఘిక వార పత్రికలు

సంఘంలో ఉండే అనేక విషయాలకు ముఖ్యంగా సామాజిక స్థితిగతులకు ప్రాధాన్యమిస్తూ వెలువడే పత్రికలను 'సాంఘిక పత్రికలు' అంటారు. తెలుగులో వెలువడిన మొదటి వారపత్రిక వృత్తాంతి (Vruttanti). ఈ వృత్తాంతి పత్రికను మండిగల వెంకట్రాయశాస్త్రి మద్రాసునుంచి 1838వ సంవత్సరంలో వెలువరించారు. ఈ పత్రిక ప్రతులేవీ లభించడం లేదు.

రెవరెండ్ పీటర్ పెర్సివల్ (Revarend Peter Percival) సంపాదకత్వంలో *దినవర్తమాని* (Dinavartamani) పత్రిక మద్రాసునుంచి వెలువడింది. 1855వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ పత్రిక మొదట తమిళంలో వెలువడింది. ఆ తర్వాత 1856 జూలైనుంచి తెలుగులో కూడా వెలువడింది. ఈ పత్రిక నడపడానికి ప్రభుత్వమే ఉచితంగా భవనవసతిని కల్పించింది. అందువల్ల ఈ పత్రిక ప్రభుత్వ విధానాలను సమర్థిస్తూ, ప్రభుత్వానికి విధేయంగా నడుచుకుంది. ఈ పత్రికలో వార్తలే కాకుండా విజ్ఞానశాస్త్ర విషయాలు, గలివర్స్ ట్రావెల్స్, రాబిన్ సన్, క్రూసో లాంటి సారస్వత గ్రంథాలు, విమర్శ వ్యాసాలు మొదలైన విషయాలు

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

కూడా చోటుచేసుకున్నాయి. అంతేకాకుండా "1851లో ప్రారంభమైన టెలిగ్రాఫ్, కేబుల్ సౌకర్యాలను మొట్టమొదటగా ఈ పత్రికనే ఏర్పాటుచేసుకుంది" (*వెంకటేశ్వర రావు, పొత్తూరి. 2004. పుట: 101*).

వివేకవర్ధని పత్రికను కందుకూరి వీరేశలింగం స్థాపించారు. క్రీ.శ.1874లో ప్రారంభమైన ఈ పత్రిక రాజమండ్రిలోని ధవళేశ్వరం నుండి వెలువడింది. ఈ పత్రిక భాషాభివృద్ధి, దేశాభివృద్ధి లక్ష్యాలతో వెలువడింది. మాసపత్రికగా ప్రారంభమైన ఈ పత్రిక, తర్వాత పక్షపత్రికగా, ఆ తర్వాత వారపత్రికగా మారి, సుమారు 20 సంవత్సరాలపాటు నడిచింది. ఇందులో ఉద్యోగుల అవినీతి, వేశ్యావృత్తి మొదలైన సాంఘిక విషయాలకు సంబంధించిన వ్యాసాలు, వచన ప్రబంధాలు (నవలలు), ప్రహసనాలు, నాటకాలు, కవుల చరిత్రలు, అనువాదాలు, గ్రంథసమీక్షలు, కృతిప్రశంసలు, మొదలైన అనేక సాహిత్యాంశాలను ప్రచురించేవారు.

2.3 రాజకీయ వార పత్రికలు

రాజకీయ విషయాలకు ప్రాధాన్యమిస్తూ వెలువడే పత్రికలను 'రాజకీయ పత్రికలు' అంటారు. ఆంధ్రప్రకాశిక, దేశోపకారి, శశిలేఖ, దేశాభిమాని, విబుధరంజని వంటి పత్రికలు రాజకీయ అంశాలకు ప్రాధాన్యమిస్తూ ప్రతివారం వెలువడేవి.

1885లో *ఆంధ్రప్రకాశిక* పత్రిక మద్రాసునుంచి వెలువడింది. తెలుగులో వెలువడిన మొదటి రాజకీయ ప్రాధాన్యం గల పత్రిక *ఆంధ్రప్రకాశిక*. ఈ పత్రిక ఎ.సి. పార్థసారథినాయుడు సంపాదకత్వంలో 1885వ సంవత్సరంలో ప్రారంభమై, 42 సంవత్సరాలపాటు నడిచింది. ఈ పత్రిక తెలుగు పాఠకుల్లో రాజకీయ చైతన్యాన్ని పెంపొందింపజేయడంలోపాటు పత్రిక పఠనాభిరుచిని గణనీయంగా పెంచింది.

దేవగుప్తం శేషాచలపతిరావు సంపాదకత్వంలో *దేశాభిమాని* పత్రిక 1886లో గుంటూరు నుంచి వెలువడింది. ఈ పత్రికను శేషాచలపతిరావు *కృష్ణా వృత్తాంతిని* అని, *కృష్ణా న్యూస్* అని కొంతకాలం బెజవాడనుంచి ప్రచురించి, దాన్నే *దేశాభిమానిగా* మార్చి గుంటూరునుంచి వెలువరించారు. ఈ పత్రిక 1886లో పక్షపత్రికగా ప్రారంభమై, తర్వాత ద్వివార, త్రివార పత్రికగా కొనసాగి, దినపత్రికగా మారింది. తెలుగులో వెలువడిన మొట్టమొదట దినపత్రిక *దేశాభిమాని*. ఈ పత్రికలో రాజకీయ అంశాలు చోటు చేసుకున్నాయి. ఈ పత్రిక ముప్పై సంవత్సరాలు నడిచింది.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

సత్తిరాజు సీతారామయ్య సంపాదకత్వంలో 1893లో ఏలూరునుంచి *దేశోపకారి* వారపత్రిక వెలువడింది. దీనికి చిలుకూరి వీరభద్రరావు కొంతకాలం సంపాదకత్వం వహించారు. ఈ పత్రికలో రాజకీయ అంశాలతో పాటు సాంఘిక విషయాలు కూడా చోటుచేసుకున్నాయి.

1894లో గట్టుపల్లి శేషాచార్యులు సంపాదకత్వంలో మద్రాసునుంచి *శశిలేఖ* పత్రిక వెలువడింది. గట్టుపల్లి శేషాచార్యులతో పాటు నేలటూరు పార్థసారథి అయ్యంగారు కూడా ఈ పత్రికకు కొంతకాలం సంపాదకత్వం వహించారు. ఈ పత్రికలో రాజకీయ విషయాలు ప్రచురింపబడేవి, గ్రంథవిమర్శలు కూడా ఉండేవి. 1894వ సంవత్సరంలో దామరాజు రామచంద్రరావు సంపాదకత్వంలో ఏలూరునుంచి *విబుధ రంజని* అనే రాజకీయ వారపత్రిక వెలువడింది.

2.4 వైజ్ఞానిక వార పత్రికలు

విజ్ఞానానికి సంబంధించిన అంశాలకు ప్రాధాన్యతనిస్తూ వెలువడే పత్రికలను 'వైజ్ఞానిక పత్రికలు' అంటారు. *రాజయోగి* అనే వైజ్ఞానిక పత్రిక 1891వ సంవత్సరంలో కాకినాడనుంచి గురజాడ శ్రీరామమూర్తి సంపాదకత్వంలో వెలువడింది. ఈ పత్రిక ప్రతిసంచికలో ఒక కంద పద్యాన్ని ప్రచురించేవారు. ఈ పత్రికను రెండు భాగాలుగా విభజించి విషయాలను అందించేవారు. మొదటి భాగంలో మందారమంజరి అనే శీర్షికలో వార్తలను, వ్యాఖ్యలను ప్రచురించేవారు. రెండవ భాగంలో ప్రబంధ కల్పవల్లి శీర్షికతో ఆధ్యాత్మిక, సాహిత్యాది విషయాలను ప్రచురించేవారు.

2.5 నైతికతను ప్రబోధించిన వార పత్రికలు

నీతి సంబంధమైన అంశాలకు ప్రాధాన్యాన్ని ఇస్తూ వెలువడే పత్రికలను 'నైతిక పత్రికలు' అంటారు. 1981లో ఆర్. జగన్నాథయ్య *సన్మార్గబోధిని* అనే నైతిక పత్రికను బళ్ళారినుంచి వెలువరించేవారు. ఇందులో వ్యక్తిత్వం, నైతిక విలువలకు సంబందించిన అంశాలు ప్రచురితం అయ్యేవి.

2.6 మత విషయాలకు ప్రాధాన్యం ఇచ్చిన వార పత్రికలు

మత సంబంధ విషయాలకు ప్రాధాన్యతనిస్తూ వెలువడే పత్రికలను 'మత పత్రికలు' అంటారు. క్రైస్తవ మతానికి సంబంధించిన అంశాలకు ప్రాధాన్యాన్ని ఇస్తూ వెలువడే పత్రికలను 'క్రైస్తవ మత పత్రికలు' అంటారు. జె.బి. మలూరియన్ సంపాదకత్వంలో *రవి* అనే క్రైస్తవ మతపత్రిక 1887లో స్థాపించబడింది. ఈ

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

పత్రికను కెనేడియన్ బాప్టిస్టు మిషనరీవారు కాకినాడనుంచి ప్రచురించేవారు. ఈ పత్రికలో మతవిషయాలతో పాటు, ఇతర విషయాలు కూడా ఉండేవి.

2.7 పారిశ్రామిక విషయాలకు ప్రాధాన్యం ఇచ్చిన వార పత్రికలు

పరిశ్రమలకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యాన్ని ఇస్తూ వెలువడే పత్రికలను 'పారిశ్రామిక పత్రికలు' అంటారు. 1899లో *కళానిధి వృత్తాంతము* అనే పారిశ్రామిక పత్రిక గుంటూరు నుంచి వెలువడింది.

3. పక్ష పత్రికలు

పదిహేను రోజులకి ఒకసారి వెలువడే పత్రికలను 'పక్షపత్రికలు' అంటారు. ఈ దశలో పుట్టిన పత్రికే *శ్రీ యక్షిణి*. ఈ సాహిత్యపత్రికను త్యాగరాజ మొదలి, వెంకట రమణకవి 1863లో పక్షపత్రికగా బళ్ళారినుండి ప్రచురించారు.

3.1 సాంఘిక పక్ష పత్రికలు

1874 అక్టోబర్‌లో కందుకూరి వీరేశలింగం మాసపత్రికగా ప్రారంభించిన *వివేక వర్ధని* పత్రిక 1876 జులై నుంచి 1885 వరకు పక్షపత్రికగా నడిచింది. వీరేశలింగం ఈ పత్రికను సామాజిక ప్రయోజనం కోసం ఉపయోగించుకున్నారు. ఈ పత్రిక ద్వారా వీరేశలింగం ప్రజలలో సాంఘిక చైతన్యాన్ని, దేశాభిమానాన్ని పెంపొందించారు.

3.2 వైజ్ఞానిక పక్ష పత్రికలు

విజ్ఞాన వర్ధని అనే వైజ్ఞానిక పత్రికను ఎల్లమరాజు నారాయణమూర్తి స్థాపించారు. 1895లో ప్రారంభమైన ఈ పత్రిక రాయదుర్గంనుండి పక్షపత్రికగా వెలువడింది. ఈ పత్రిక తెలుగులో వెలువడిన తొలి విజ్ఞాన శాస్త్రపత్రిక.

3.3 మత విషయాలకు ప్రాధాన్యం ఇచ్చిన పక్ష పత్రికలు

బాప్టిస్టు (Baptist) అనే క్రైస్తవ మత పత్రికను డబ్ల్యూ.యమ్. కాంబెల్ 1899లో పక్షపత్రికగా స్థాపించి, వెలువరించారు.

3.4 వ్యవసాయరంగ విషయాలను ప్రచురించిన పక్ష పత్రికలు

వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలకు ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇస్తూ వెలువడే పత్రికలను

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

'వ్యవసాయ పత్రికలు' అంటారు. 1893లో *జ్ఞానోదయం* అనే వార్తాపత్రిక దాసు కేశవరావు సంపాదకత్వంలో ఏలూరు నుంచి పక్షపత్రికగా వెలువడింది. ఇది వ్యవసాయానికి అంకితమైన పత్రిక. ఈ పత్రికలో వ్యవసాయం, పశుపోషణ, వర్తకం, తోటల పెంపకం వంటి వ్యవసాయ అంశాలతో పాటు కులాచారాలు, గెజిట్ ఆర్డర్లు, వినోదాలు మొదలైన అంశాలు కూడా చోటుచేసుకునేవి.

4. మాస పత్రికలు

నెలకు ఒకసారి వెలువడే పత్రికలను 'మాస పత్రికలు' అంటారు. 19వ శతాబ్దం తెలుగు సాహిత్యం మరియు ప్రచురణ రంగ చరిత్రలో ఒక నూతన విప్లవానికి శ్రీకారం చుట్టింది. అంతవరకు తాళపత్ర గ్రంథాలకు, పండిత పరిమితులకు మాత్రమే పరిమితమైన తెలుగు సాహిత్యాన్ని సాధారణ ప్రజానీకానికి అందుబాటులోకి తేవడంలో 'మాస పత్రికలు' అత్యంత కీలకమైన పాత్ర పోషించాయి.అచ్చు యంత్రాల ప్రారంభం, క్రైస్తవ మిషనరీల మత ప్రచారం, సాంఘిక సంస్కరణోద్యమాలు మరియు భాషా వికాసం 19వ శతాబ్దపు మాసపత్రికల ఆవిర్భావానికి ప్రధాన ప్రేరకాలుగా నిలిచాయి

4.1 సాహిత్య మాస పత్రికలు

"సారస్వత విషయాలకే ప్రాముఖ్యమిచ్చిన మొట్టమొదటి పత్రిక సుజనరంజని" అని తిరుమల రామచంద్ర *(1992. పుట:11)*, "సాహిత్య విషయాలకు ప్రాధాన్యం ఇచ్చిన మొట్టమొదటి తెలుగు పత్రిక సుజనరంజని" అని డా. వి. లక్ష్మణరెడ్డి *(2002. పుట:40)* తెలిపారు.

సుజన రంజని తొలి తెలుగు సాహిత్య పత్రిక అనే విషయంలో అభిప్రాయభేదం లేదు. *సుజనరంజని* పత్రిక మొదట మాసపత్రికగా వెలువడి, తర్వాత ద్వైమాస పత్రికగా మారింది. ఈ పత్రికకు వింజమూరి కృష్ణమాచార్యులు, బహుజనపల్లి సీతారామాచార్యులు, కారుమంచి సుబ్బరాయుడు నాయుడు సంపాదకులుగా ఉన్నారు. ఈ పత్రికలో భాష గ్రాంథికంలో ఉండేది. ఈ పత్రిక చిన్నయసూరి రచించిన *నీతిచంద్రిక* టిప్పణి, *భారతం, భాగవతం, భాస్కర రామాయణం* వంటి గ్రంథాలకు, మనుచరిత్ర వంటి ప్రబంధాలకు లఘుటిప్పణులను ప్రచురించింది. ఈ పత్రిక ప్రభావం తర్వాత వచ్చిన అనేక తెలుగు సాహిత్య పత్రికలపైన ఎంతో ఉంది.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

గురజాడ శ్రీరామమూర్తి సంపాదకత్వంలో 1880 జూలైలో వెలువడిన *ప్రబంధ కల్పవల్లి* పత్రిక ప్రాచీన ప్రబంధాలను ప్రచురించడమే ధ్యేయంగా వెలువడింది. ఈ పత్రికలో ప్రాచీన శాసనాలు, శతకాలు, నాటకాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు వంటి విషయాలు ప్రచురింపబడేవి.

పూండ్ల రామకృష్ణయ్య సంపాదకత్వంలో నెల్లూరునుంచి *అముద్రిత గ్రంథ చింతామణి* మాసపత్రిక వెలువడింది. ఈ పత్రిక సహాయ సంపాదకుడు ఒడియరు వీరనాగయ్య. "1835 నుంచి అర్ధశతాబ్ది వరకు అంటే 1885 వరకు వెలువడిన సాహిత్య పత్రికలలో సాహిత్యేతర విషయాలుండేవి. కాని అముద్రిత గ్రంథ చింతామణి కేవలం సాహిత్యానికే అంకితమైపోయి విమర్శన విషయాల్లోనూ పాశ్చాత్య పద్ధతులకు నారుపోసి గొప్ప సంస్థగా వెలిగింది" అని తిరుమల రామచంద్ర *(1992. పుట: 26)* పేర్కొన్నారు. అముద్రిత గ్రంథాలను ప్రచురించే పత్రిక అని మనకు పేరును బట్టే తెలుస్తుంది. ఈ పత్రిక ప్రధానంగా ప్రాచీన గ్రంథాల ప్రచురణ, వాటి దేశకాల నిర్ణయాలపై చర్చలను ప్రచురించేది.

అముద్రిత గ్రంథ చింతామణి తర్వాత ప్రాచీన గ్రంథాలను ముద్రించిన మరోపత్రిక *చింతామణి*. ఈ పత్రిక న్యాపతి సుబ్బారావు నిర్వహణలో 1890లో రాజమండ్రినుండి వెలువడింది. తెలుగు భాషకు, తెలుగు సాహిత్యాభివృద్ధికి ఎనలేని కృషిచేసింది. తొలిసారిగా తెలుగులో నవలా రచన పోటీలు *చింతామణి* పత్రిక ప్రారంభించింది.

1894లో మద్రాసునుండి వెలువడిన *శ్రీ విజయంతి* పత్రిక సాహిత్యానికి ఎంతో కృషి చేసింది. దీని సంపాదకులు పునప్పాకం అనంతాచార్యులు. ఈ పత్రికలో విద్యా విషయ వ్యాసాలు, పురాతన గ్రంథాల గుణగణాలపై చర్చలు, అముద్రితాలయిన పూర్వ కృతులు, నవీనకావ్యాలు, ఆధునిక గ్రంథవిమర్శలు అన్నింటిని ప్రచురించేవారు.

1896 జనవరిలో ప్రారంభమైన *శ్రీశారద* మాసపత్రిక నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెం నుండి వెలువడింది. దీని సంపాదకులు దొడ్ల వెంకట్రామారెడ్డి. ఈ పత్రికలో యక్షగానాలు, శతకాలు, గ్రంథ విమర్శలు, అవతారికలు, కావ్యాలు మొదలైనవి ప్రచురించారు.

కొచ్చెర్లకోట రామచంద్ర వెంకటకృష్ణారావు సంపాదకత్వంలో రాజమండ్రినుంచి 1898లో *శ్రీసరస్వతి* పత్రిక వెలువడింది. ఈ పత్రికకు మేనేజింగ్ ఎడిటరు శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు. ఈ

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

పత్రిక అముద్రిత గ్రంథాలను, ఉత్తమ ప్రబంధాలను, జ్ఞాన, నీతి బోధకాలు, వినోద దాయకాలు అయిన కథలను, వచన కావ్యాలను, ఉత్తముల జీవిత చరిత్రలను, దేశచరిత్రలను, యాత్రా చరిత్రలను, నవలలను ముఖ్యంగా ప్రచురించేది.

రాజా మంత్రిప్రగడ భుజంగరావు సంపాదకత్వంలో ఏలూరునుండి 1898లో వెలువడిన పత్రిక *మంజువాణి*. ఈ పత్రికలో అనేక కథలు, జీవిత చరిత్రలు, నవలలు, నాటకాలు ప్రచురింపబడ్డాయి.

వాగ్వల్లి మాసపత్రిక 1899 జనవరిలో నెల్లూరునుండి కొమాండూరు వెంకట రామానుజశర్మ సంపాదకత్వంలో వెలువడింది. ఇది గ్రాంథికభాషలో వెలువడిన పత్రిక. ఈ పత్రికలో పులుగుర్త నరసింహకవి రచించిన *ఆత్మావలోకనం, శ్రీరామనామ మహాత్మ్యం, సంక్షేప రామాయణం, వచన హరివంశం* వంటి రచనలు ప్రచురింపబడ్డాయి.

1898 జనవరిలో రాజమండ్రి నుండి శ్రీపాద కృష్ణమూర్తి సంపాదకత్వంలో *కళావతి* పత్రిక ప్రారంభమైంది. ఈ పత్రిక కూడా గ్రాంథికభాషలో వెలువడింది. ఇందులో ప్రబంధాలు, ప్రాచీన కవుల, ఆధునిక కవుల పద్య కావ్యాలు, నాటకాలు మొదలైనవి ప్రచురింపబడ్డాయి.

శ్రీభారతి పత్రిక 1990 ఫిబ్రవరిలో నెల్లూరు నుండి వావిలికొలను సుబ్బారావు సంపాదకత్వంలో వెలువడింది. దీనిలో అనేక ప్రాచీన గ్రంథాలు ప్రచురించబడ్డాయి. వీటితోపాటు ఈ శతాబ్దంలో దాసు శ్రీరాములు సంపాదకత్వంలో *అనల్ప జల్పితా కల్పవల్లి*, పులవర్తి శాంతయ్య సంపాదకత్వంలో *కళానిధి*, పి. శ్రీనివాస జగన్నాథశాస్త్రి సంపాదకత్వంలో *గ్రంథ ప్రదర్శిని*, జనమంచి శేషాద్రిశర్మ సంపాదకత్వంలో *ఆనందదాయిని*, యస్. కృష్ణారావు సంపాదకత్వంలో *బాల సరస్వతి*, ఓగిరాల జగన్నాథం సంపాదకత్వంలో *మందార మంజరి* వంటి సాహిత్య పత్రికలు వెలువడ్డాయి.

4.2 సాంఘిక మాస పత్రికలు

మహామహోపాధ్యాయ కొక్కొండ వెంకటరత్నం సంపాదకత్వంలో *ఆంధ్ర భాషా సంజీవని* పత్రిక స్థాపించబడింది. ఈ పత్రిక 1871లో ప్రారంభమై, మద్రాసు నుంచి వెలువడింది. "'ఆంధ్ర' శబ్దంతో స్థాపించబడిన మొదటి పత్రిక ఇదే. ఈ పత్రికలోని రచనలన్నీ గ్రాంథికభాషలో ఉండేవి. ప్రథమాంధ్ర వ్యాస రచయిత్రిగా పేరుపొందిన పోతం జానకమ్మ తన విదేశీ యాత్రను గురించి రాసిన వ్యాసం ఈ పత్రికలోనే

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

ప్రచురించారు" *(లక్ష్మణరెడ్డి, వి. 2002. పుట: 42)*. ఈ పత్రిక వితంతు వివాహాలు, స్త్రీ విద్య మొదలైన సాంఘిక సంస్కరణలను వ్యతిరేకిస్తూ వ్యాసాలు ప్రచురించింది. ఈ పత్రికలో సారస్వత విషయ చర్చలు, సాంఘిక, రాజకీయ విషయాలు, గ్రంథ సమీక్షలు, కవితలు మొదలైనవి ప్రచురితమయ్యేవి.

1892లో ఉమారంగనాయకులు సంపాదకత్వంలో మచిలిపట్నం నుండి *పురుషార్థ ప్రదాయిని* పత్రిక వెలువడింది. గొప్ప ఆశయాలతో వెలువడిన ఈ మాసపత్రిక దాదాపు ఇరవై ఏళ్ళు నడిచింది. ధైవసమాజం తరపున వెలువడిన పత్రిక కావడంచేత దీనిని *'ధైవసమాజిని'* అని, *'తత్త్వప్రకాశిని'* అని పిలిచేవారు. ఈ పత్రికలోని భాష వ్యవహారికంలో ఉండేది. సాహిత్య సంబంధమైన విమర్శలు, ప్రతివిమర్శలు ఉండేవి. "మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా ఈ పత్రిక వ్యాసాలను ప్రచురించింది. ఈ విధంగా మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా వ్యాసాలను ప్రచురించిన మొదటి పత్రిక *పురుషార్థ ప్రదాయిని* అని లక్ష్మణరెడ్డి, వి. *(2002. పుట: 44)* తెలిపారు.

1891 జూలైలో *సత్యసంవర్ధని* పత్రిక రాజమండ్రి నుండి వీరేశలింగం సంపాదకత్వంలో వెలువడింది. ఈ పత్రిక రాజమహేంద్రవరం ప్రార్థనా సమాజం తరపున వెలువడింది. సాంఘిక దురాచారాలను ఖండిస్తూ వార్తలను ప్రచురించడం, దేశభక్తి భావాలను వ్యాప్తిచేయడం ఈ పత్రిక యొక్క ఆదర్శాలు.

4.3 వైజ్ఞానిక మాస పత్రికలు

1875లో *జ్ఞానచింతామణి* అనే వైజ్ఞానిక మాసపత్రికను వి. వెంకటశాస్త్రి స్థాపించారు. ఈ పత్రిక మద్రాసు నుంచి వెలువడింది. నాదెళ్ళ పురుషోత్తం సంపాదకత్వంలో బందరు నుంచి 1891లో *బుధ విధేయ* అనే వైజ్ఞానిక మాసపత్రిక వెలువడింది. 1892లో ఆత్మకూరు నుంచి *ధర్మవర్ధని* అనే వైజ్ఞానిక మాసపత్రిక విశ్వనాథం రాఘవేంద్రశాస్త్రి సంపాదకత్వంలో వెలువడింది. 1893లో కడప నుంచి *ప్రబుద్ధాంధ్ర* వైజ్ఞానిక మాసపత్రిక వెలువడింది. అలాగే *బుద్ధి ప్రదాయిని* అనే మరో వైజ్ఞానిక మాసపత్రిక గుడివాడ నుంచి 1894లో నందగిరి వెంకట అప్పారావు సంపాదకత్వంలో వెలువడింది.

4.4 నైతికతను ప్రబోధించిన మాస పత్రికలు

1885లో జులుమూరు నుంచి భుక్త జమ్మయ్యశాస్త్రి స్థాపించిన *నీతి దర్పణము* అనే నైతిక మాసపత్రిక వెలువడింది. అలాగే ఇదేకాలంలో పిఠాపురం నుంచి *సన్మార్గ దర్శిని* అనే నైతిక పత్రిక

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

వెలువడింది. రాపాక కౌస్తుభము 1893లో స్థాపించిన నైతిక పత్రిక *స్త్రీ హితబోధిని*. ఈ పత్రిక కాకినాడ నుంచి వెలువడింది. ఈ పత్రికను ఉచితంగా పంచేవారు. 1897లో రాజమండ్రి నుంచి *సునీతి* అనే నీతిపత్రిక వెలువడింది. ఈ పత్రికను నల్లగొండ కోదండ రామయ్య స్థాపించారు.

4.5 మత విషయాలకు ప్రాధాన్యం ఇచ్చిన మాస పత్రికలు

ఈ పత్రికలు ప్రధానంగా మత వ్యాప్తి కోసం ప్రారంభించబడిన పత్రికలు. భారత దేశంలో మత వ్యాప్తికోసం ఇవి కీలకంగా పని చేశాయి.

4.5.1 క్రైస్తవ మత మాస పత్రికలు

ప్రసిద్ధ క్రైస్తవ మతాచార్యుడు జె. ఎడ్మండ్‌షార్క్ 1848లో *హితవాది* అనే మాసపత్రికను స్థాపించారు. ఈ పత్రికను మద్రాసులో ముద్రించి, మచిలిపట్నం నుంచి వెలువరించేవారు. ఈ పత్రికలో క్రైస్తవ మత విషయాలే కాకుండా, ఇతర విషయాలను కూడా ప్రచురించేవారు. 1875లో బెజవాడ నుంచి *తెలుగు బాప్టిస్ట్* అనే మాసపత్రిక వెలువడింది. ఈ పత్రిక మేడికొండూరి ఎబ్రాకెల్లరు సంపాదకత్వంలో ప్రారంభమైంది. ఈ పత్రిక చాలాకాలం నడిచిన మొదటి క్రైస్తవ మతప్రచార పత్రిక.

1876లో *జ్ఞానభాను* అనే క్రైస్తవమత మాసపత్రిక స్థాపించబడింది. ఆనస్‌సతి ప్రారంభించిన ఈ పత్రిక మద్రాసు నుంచి వెలువడింది. 1877లో క్రైస్తవమత మిషనరీలు బుట్లచాగల్లు నుంచి *రాయబారి* అనే మాసపత్రికను వెలువరించారు. 1888లో డి. అనంతం సంపాదకత్వంలో మద్రాసు నుంచి *సత్యదూత* అనే క్రైస్తవ మాసపత్రిక వెలువడింది.1891లో యఫ్.సి. మాక్రిడ్ (F.C.Makrid) సంపాదకత్వంలో మద్రాసు నుంచి *లూథరిన్* అనే మాసపత్రిక వెలువడింది.

4.5.2 హిందూమత మాస పత్రికలు

హిందూమతానికి సంబంధించిన అంశాలకు ప్రాధాన్యాన్ని ఇస్తూ వెలువడే పత్రికలను 'హిందూమత పత్రికలు' అంటారు. 1885లో స్థాపించబడిన *హిందూజన సంస్కారిణి* పత్రిక హిందూమత ఔన్నత్యం కోసం కృషి చేసింది. ఈ పత్రికను మన్నవ బుచ్చయ్య పంతులు స్థాపించారు. మన్నవ బుచ్చయ్య వీరేశలింగం సంఘసంస్కరణోద్యమానికి తోడ్పడ్డారు. ఈ పత్రికలో శ్రుతి, స్మృతి ఉపనిషత్తులతోపాటు వార్తలు, విశేషాలు, పుస్తక పరిచయాలు కూడా ఉండేవి.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

సిహెచ్. సుబ్రహ్మణ్యశాస్త్రి 1892లో *ధర్మవర్ధని* అనే హిందూ మాసపత్రికను స్థాపించారు. ఇది విశాఖపట్టణం నుంచి వెలువడింది. 1892లో *శివగ్రంథముక్తావళి* అనే మాస పత్రిక కందూకూరి శ్రీశైల వీరభద్ర వరప్రసాదరావు సంపాదకత్వంలో ఏలూరు నుంచి వెలువడింది. 1897లో టి.ఏ. స్వామినాథయ్యర్ *సత్యసాధిని* అనే మాసపత్రికను మద్రాసు నుంచి ప్రచురించారు.

4.6 పారిశ్రామిక విషయాలకు ప్రాధాన్యం ఇచ్చిన మాస పత్రికలు

1885లో *నిలి ప్రకాశిక* అనే పారిశ్రామిక మాసపత్రిక వెలువడింది. ఈ పత్రిక నీలిమందు వ్యాపార ప్రచారపత్రికగా మద్రాసు నుంచి వెలువడింది.

4.7 విద్యాసంబంధ విషయాలను ప్రచురించిన మాస పత్రికలు

విద్యాసంబంధ విషయాలకు అధిక ప్రాధాన్యాన్ని ఇస్తూ వెలువడే పత్రికలను 'విద్య పత్రికలు' అంటారు. వి.కృష్ణమాచార్యులు సంపాదకత్వంలో వెలువడిన *జనవినోదిని* పత్రిక మొదటిసారిగా బాలసాహిత్యాన్ని ప్రచురించింది. ఈ పత్రిక మద్రాసు నుంచి వెలువడేది. 1875 జూన్‌లో ప్రారంభమైన ఈ పత్రిక దాదాపు పది సంవత్సరాల కాలంపాటు వెలువడింది. ఈ పత్రిక ముఖ్యంగా పిల్లల కోసం కథలను ప్రచురించింది. ఇందులో షేక్స్‌పియర్ నాటకాల తెలుగు అనువాదాలు, సంస్కృత గ్రంథాల అనువాదాలు, విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన వ్యాసాలు ప్రచురింపబడేవి.

1882లో నెల్లూరునుంచి *విద్యార్థి కల్పభూజము* అనే విద్య మాసపత్రిక *ఉలిగొండము రామచంద్రరావు* సంపాదకత్వంలో వెలువడింది. గుంటూరు నుంచి డ్రైడను దొరసాని అనే ఆంగ్లేయ వనిత 1892లో స్థాపించిన *ఉపాధ్యాయోపకారి* పత్రిక, ఆచంట సూర్యనారాయణరావు 1895లో స్థాపించిన *శారద* పత్రిక, సి. గోపాలయ్య సంపాదకత్వంలో 1888లో విశాఖపట్నం నుంచి వెలువడిన *టీచర్* మొదలైన పత్రికలు విద్యకు సంబంధించిన విషయాలను ప్రచురించాయి.

4.8 న్యాయసంబంధ విషయాలను ప్రచురించిన మాస పత్రికలు

న్యాయరంగానికి సంబంధించిన అంశాలకు ప్రాధాన్యతనిస్తూ వెలువడే పత్రికలను 'న్యాయ పత్రికలు' అంటారు. 1894లో మద్రాసు నుంచి బి. పేరరాజు సంపాదకత్వంలో *లాయరు* అనే న్యాయ మాసపత్రిక వెలువడింది. 1895లో *తెలుగు లా వర్తమాని* అనే న్యాయపత్రిక ఏలూరు నుంచి వెలువడింది.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

ఈ పత్రిక సత్తిరాజు సీతారామయ్య సంపాదకత్వంలో వెలువడింది. 1899లో *న్యాయ బోధిని* అనే మాసపత్రిక వెలువడింది. ఈ పత్రికను కోపల్లి వెంకట రమణరావు ఒంగోలు నుంచి వెలువరించారు.

4.9 వేదాంత మాస పత్రికలు

వేదాంత సంబంధ విషయాలకు ప్రాధాన్యతనిస్తూ వెలువడే పత్రికలను 'వేదాంత పత్రికలు' అంటారు. 1864లో చెన్నపురి నుంచి వేదసమాజంవారి తరపున *తత్త్వబోధిని* మాసపత్రిక వెలువడింది. ఈ పత్రిక ప్రధానంగా బ్రహ్మసమాజ సూత్రాలను, సంఘసంస్కరణ విషయాలను ప్రచురించేది. "స్త్రీ పునర్వివాహ నాటకోపన్యాసములు" తొలిసారిగా ఈ పత్రికలోనే ప్రచురితమయ్యాయి. ఇందులో మతసంబంధమైన వ్యాసాలు, సూర్యగ్రహణాదులకు సంబంధించిన వైజ్ఞానిక వ్యాసాలు ప్రచురింపబడ్డాయి. నేడు మనం "వ్యాసం" అని పిలుస్తున్న ప్రక్రియను మొదటగా ప్రవేశపెట్టింది ఈ పత్రికే.

1895లో బి. శ్రీనివాసశాస్త్రి సంపాదకత్వంలో మద్రాసు నుంచి *బ్రహ్మవిద్య* వేదాంత మాసపత్రిక వెలువడింది. అలాగే ఏ. నరసింహాచార్యులు సంపాదకత్వంలో ముమ్ముళ్లు *జనరంజని* అనే వేదాంత మాసపత్రిక 1898లో మద్రాసు నుండి వెలువడింది.

4.10 హాస్యసంబంధ విషయాలను ప్రచురించిన మాస పత్రికలు

హాస్యానికి ప్రాధాన్యతనిస్తూ వెలువడిన పత్రికలను 'హాస్య పత్రికలు' అంటారు. 1875లో కొక్కొండ వెంకటరత్నం పంతులు *హాస్యవర్ధని* పత్రికను స్థాపించారు. ఇది మద్రాసు నుంచి వెలువడింది. వీరేశలింగం *వివేక వర్ధని* పత్రికను హేళన చేస్తూ ఈ పత్రికను స్థాపించారు. ఈ పత్రిక అట్టమీద దంతముఖుడైన విఘ్నేశ్వరుడు ఇరు పార్శ్వాల్లో మూషికాలు తనను సేవిస్తూ ఉంటే, నిలబడి తాండవమాడినట్లుగా ఉండేది. వీరేశలింగం ప్రచురించే వ్యాసాలను ఖండిస్తూ, ఈ పత్రికలో వ్యాసాలను ప్రచురించేవారు. కొద్దికాలంలోనే ఈ పత్రిక *ఆంధ్రభాషా సంజీవని*లో కలిసిపోయింది.

కొక్కొండవారు వెలువరించిన *హాస్య వర్ధని*కి ప్రతిగా వీరేశలింగం *హాస్యసంజీవని* పత్రికను 1876లో స్థాపించారు. ఈ పత్రిక వివేకవర్ధని పత్రికకు అనుబంధంగా వెలువడేది. ఈ పత్రిక అట్టమీద సింహముఖుడైన విఘ్నేశ్వరుడు ఇరుపార్శ్వాల్లో మార్జాలాలు తనకు సేవిస్తూ ఉంటే నిలబడి తాండవమాడుతున్నట్లు ప్రచురించారు. గజసింహాలకు, మూషిక మార్జాలాలకు మధ్య ఉండే వైరాన్ని కొక్కొండ, వీరేశలింగం ఈ

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

విధంగా వినియోగించుకున్నారు. ఈ పత్రిక కూడా కొద్దికాలంలోనే వివేక వర్ధని పత్రికలో కలిసిపోయింది.

4.11 మహిళలకు సంబంధించిన విషయాలను ప్రచురించిన మాస పత్రికలు

మహిళాభివృద్ధి, మహిళలకు సంబంధించిన అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వెలువడే పత్రికలను 'మహిళా పత్రికలు' అంటారు. కందుకూరి వీరేశలింగం సంపాదకత్వంలో *సతీహితబోధిని* మాసపత్రిక రాజమండ్రి నుండి వెలువడింది. 1883లో స్థాపించిన ఈ పత్రిక స్త్రీలకు లోడుగా నిలిచింది. *సత్యవతి చరిత్రం* వంటి స్త్రీ జీవిత రచనలు, స్త్రీలకు ఉపయోగకారిగా ఉండే రచనలు ఈ పత్రికలో ప్రచురించేవారు.

స్త్రీల కోసం స్థాపించబడిన రెండవ పత్రిక *తెలుగు జనానా*. ఈ పత్రికను 1893 జూలైలో మల్లాది వెంకటరత్నం ప్రారంభించారు. 1894 నుంచి రాయసం వెంకటశివుడు ఈ పత్రికను నిర్వహించారు. ఈ పత్రిక స్త్రీవిద్య కోసం ఎంతగానో కృషి చేసింది. సంగీతపు బాపిరాజు స్థాపించిన *బాలిక* మాసపత్రిక శ్రీకాకుళం నుండి 1896లో వెలువడింది. "తెలుగులో లొలి మహిళా మాసపత్రిక ఇదే కావచ్చు" అని తిరుమల రామచంద్ర *(1992. పుట: 13)* పేర్కొన్నారు. ఈ పత్రిక స్త్రీవిద్యాభివృద్ధి కోసం కృషిచేసింది.

ఉపయుక్త గ్రంథసూచి

1. చంద్రశేఖర్, ఎస్జీడి.1987. సమాచారాల చేరవేత మరియు పాత్రికేయత్వం. తిరుపతి: ఎస్జీడి పబ్లికేషన్స్.

2. రాధాకృష్ణ, బూదరాజు. 1981. ఈనాడు భాషాస్వరూపం. హైదరాబాదు: ఉషోదయా పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్.

3. రామచంద్ర, తిరుమల. 1992. తెలుగు పత్రికలు - సాహిత్య సేవ. హైదరాబాదు: విశాలాంధ్ర బుక్‌హౌస్.

4. లక్ష్మణ రెడ్డి, వి. 2002. తెలుగు జర్నలిజం అవతరణ - వికాసం. హైదరాబాదు: రచన జర్నలిజం కళాశాల.

5. సౌభాగ్యమ్మ, ఎస్.హెచ్. 1992. తెలుగులో సాహిత్య పత్రికలు. తిరుపతి. ఎస్జీడి పబ్లికేషన్స్.

6. వెంకటేశ్వరరావు, పొత్తూరి. 2004. ఆంధ్రజాతి అక్షర సంపద తెలుగు పత్రికలు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

7. చెన్నయ్య, జి. 2003 (మొదటి ముద్రణ 1998). తెలుగు దినపత్రికలు - భాషా, సాహిత్య స్వరూపం. హైదరాబాదు: రవికిరణ్ పబ్లికేషన్స్.